ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
సోమవారం 11 నవంబరు 2024





గోడపై సీతాకోకచిలుక పెయింటింగ్

చాచాను పలకరిద్దాం.. ఊయల ఊగొద్దాం!



సిద్దిపేట పారుపల్లివీధిలోని వాటర్‌ట్యాంక్ స్థలంలో నెహ్రూ విగ్రహం వద్ద నిర్మించిన ఫౌంటేన్, పడవ ఆకారపు ఊయలపై చిన్నారులు





చుట్టూ ప్రహరీ.. మధ్యలో వాటర్ ట్యాంక్.. అందులో ఏర్పాటు చేసిన నెహ్రూ విగ్రహం.. సిద్దిపేట పట్టణం పారుపల్లివీధిలోని ట్యాంక్ స్థలంలో ఒకప్పుడు ఇవే దర్శనమిచ్చేవి. కానీ, ప్రస్తుతం పూర్తిగా మారిపోయింది. ఓ పార్కులా తీర్చిదిద్దారు. చుట్టూ పచ్చని గడ్డి, చల్లని వాటర్ ట్యాంక్ కింద పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన పడవ, హంస ఊయలలు, గుర్రం, జింక ఆటలు, సీతాకోకచిలుక వాల్ పెయింటింగ్‌తో ఆహ్లాదంగా మారింది. ఏనుగు తలలపై శాంతి కపోతాన్ని ఎగురవేస్తూ నిలబడే జవహర్‌లాల్‌నెహ్రూ విగ్రహం, రెండు పక్కల డాల్ఫిన్లు.. ఫౌంటేన్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల అందుబాటులోకి తీసుకురాగా, పట్టణవాసులు సెలవురోజుల్లో పిల్లలతో వచ్చి సరదాగా గడుపుతున్నారు. సెల్ఫీలు దిగి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)



వాటర్‌ట్యాంక్ కింద స్థలంలో ఏర్పాటు చేసిన ఆటవస్తువులతో ఆడుకుంటున్న చిన్నారులు, బెంచ్‌పై సేదతీరుతున్న పెద్దలు

నేడు సీసీఐ పత్తి కొనుగోళ్లు బంద్

గజ్వేల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో సోమవారం కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జిల్లా శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా కొనుగోళ్లు సాఫీగా సాగేలా చూడాలని, కానీ ఈఏడాది సీసీఐ కఠిన నిబంధనల పేరుతో రైతులను పత్తి కొనుగోలులో ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరుతో మిల్లర్లకు ఇబ్బందులు పెడుతున్నారని నిరసిస్తూ సోమవారం పత్తి కొనుగోళ్లను నిలిపివేయనున్నట్లు తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

భూసర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకున్న రైతులు

అక్కన్నపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చౌటపల్లిలో ఇండస్ట్రీయల్ పార్క్ నిర్మాణం కోసం భూములను సర్వే చేసేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను ఆదివారం రైతులు అడ్డుకుని నిలదీశారు. తమ తాత ముత్తాతల నుంచి వారసత్వంగా వస్తున్న భూముల్లో పారిశ్రామిక పార్క్‌ను నిర్మించడం సరికాదని రైతులు ఈ సందర్భంగా తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామని, తమ భూములను లాక్కొని, బతుకులను ఆగం చేయొద్దని ఆందోళన వ్యక్తంచేశారు. సర్వే నంబర్ 312లో ఉన్న భూములను సర్వే చేసేందుకు మరోసారి ఎవరూ రావద్దని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని రైతులు చెప్పడంతో రెవెన్యూ అధికారులు వెళ్లిపోయారు.



గండిపల్లిలో చదును చేసిన స్థలం, ఇన్‌సెట్‌లో ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న గుట్ట

గుట్టకాయ స్వాహా

దర్జాగా ప్రభుత్వ భూములు కబ్జా

గుట్టలను సైతం వదలని భూబకాసురులు

ఎక్స్‌కవేటర్‌తో తవ్వి చదును చేస్తున్న వైనం

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

అక్కన్నపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు దర్జాగా కబ్జా చేసి చదును చేసేస్తున్నారు. గుట్టలను సైతం వదలకుండా మింగేస్తున్నారు. ఏకంగా యంత్రాలతో తవ్వుతున్నా అధికారులకు మాత్రం పట్టడం లేదు. దీంతో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కరిగిపోతున్నాయి. కిందిస్థాయి రెవెన్యూ సిబ్బంది, భూఅక్రమార్కులతో కుమ్మక్కు కావడంతోనే చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


గండిపల్లిలో కబ్జాలు

అక్కన్నపేట మండలం గండిపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 579లో 600 ఎకరాలపైగా ప్రభుత్వ భూమి ఉంది. ఈ సర్వే నంబర్‌లో కొంత భూమిని గతంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసింది. ఈ ప్రాంతంలో గండిపల్లి ప్రాజెక్టు నిర్మిస్తుండటంతో ఇక్కడి భూములపై కన్నేసిన కొంతమంది గుట్టలను సైతం ఎక్స్‌కవేటర్‌తో చదును చేయిస్తున్నారు. పెద్ద పెద్ద యంత్రాలను పెట్టి రాళ్లను తొలగింపజేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ గండిపల్లి ప్రాజెక్టు నిర్మిస్తుండటంతో త్వరలోనే సాగునీరు రానుంది. ఈ క్రమంలో వ్యవసాయ భూములకు డిమాండ్ పెరిగింది. పట్టా భూముల కంటే కబ్జా చేసిన ప్రభుత్వ భూములు తక్కువ ధరలకు విక్రయిస్తూ ఉండడంతో పలువురు

మిగతా 8వ పేజీలో

తాటివనం దగ్ధంతో గీత కార్మికుల ఇబ్బందులు చూడలేకపోయా

- మూడు బోర్లు వేయించి, మోటార్లు పెట్టించాను
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



తాటి వనంలో బోరుమోటార్‌ను ఆన్‌చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

హుస్నాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణం పొట్లపల్లి రోడ్డు తాటి వనంలో బోర్లను ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలల క్రితం హుస్నాబాద్ పట్టణ శివారులోని పొట్లపల్లి రోడ్డులో తాటి చెట్లు దగ్ధం కావడంతో గీత కార్మికులు చాలా బాధ పడ్డారన్నారు. అప్పుడు వనంలో నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని తన దృష్టికి తీసుకరాగా సొంత ఖర్చులతో ఈ బోర్లు వేయించి, మోటార్లు పెట్టించానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సంజయ్‌కి గీతకార్మికులు డప్పుచప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన తాటి వనంలో కార్మికులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు పొట్లపల్లి స్వయంభూ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పొట్లపల్లి గుట్ట వద్ద ఎల్లమ్మదేవిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ - జనగామ రోడ్డు భారత మాల ప్రాజెక్టు పరిధిలోకి చేర్చేందుకు పరిశీలిస్తామని విలేఖరులకు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి అన్నివిధాల పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, లక్కిరెడ్డి తిరుమల, లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, నాయకులు పొట్లపల్లి శ్రీనివాస్, కొత్తపల్లి అశోక్, చిట్టి గోపాల్‌రెడ్డి, బత్తుల శంకర్‌బాబు, నాయకులు, గీతకార్మికులు పాల్గొన్నారు.

గోప్యంగా సర్వే వివరాలు

- ఎలాంటి అనుమానాలు అవసరం లేదు : మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవో 18 ద్వారా ప్రభుత్వం చేస్తున్న ఇంటింటి కులగణన సర్వే వివరాలను గోప్యంగా ఉంచుతామని, ఇందులో ప్రజలకు ఎలాంటి అనుమానాలు అవసరం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని ఓ ఇంటిలో ఎన్యూమరేటర్స్‌తో కలిసి ఆయన సర్వే వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ద్వారా మీ కుల బలమెంతో తెలిస్తే అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పట్టణంలో నిర్మాణంలో ఉన్న బంజారా భవన్‌ను పరిశీలించారు. ఆయనవెంట నాయకులు అక్కు శ్రీనివాస్, వల్లపు రాజు తదితరులున్నారు.



హ్యాండ్‌బాల్‌లో విజేతగా నిలిచి ట్రోఫీని అందుకుంటున్న ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు

క్రీడలను ప్రోత్సహించేందుకే స్పోర్ట్స్ యూనివర్సిటీ

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు
- బాలుర విభాగంలో వరంగల్.. బాలికల విభాగంలో ఆదిలాబాద్ విజేతలు

7

డీసీఎం, ఆటో ఢీకొని.. ముగ్గురికి తీవ్ర గాయాలు

- అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలింపజేసిన మంత్రి పొన్నం

సాహో సహకారం

ఆదర్శంగా నిలుస్తున్న హుస్నాబాద్ పీఏసీఎస్

- జీతాలివ్వలేని స్థితి నుంచి కోట్ల టర్నోవర్‌కు సంఘం
- రైతుల సంక్షేమం, రుణాలు, వ్యాపారాల్లో మేటి
- రూ.2.80 కోట్లతో నూతన భవన నిర్మాణం

హుస్నాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 2005 వరకు అధ్వాన స్థితిలో ఉండేది.. ఆ సంఘంలో కూర్చునేందుకు కుర్చీలు కూడా లేని దుస్థితి.. ఆనాటి ప్రభుత్వం రూ.1.68 కోట్లను మంజూరు చేయగా, రైతులకు అవసరమైన వ్యాపారాలను ప్రారంభించి లాభాల పట్టింది. సాహో అనిపించేలా ఎదిగి సహకార సంఘాన్ని పటిష్టపరిచింది.

7లో





రూ.2.80 కోట్లతో నూతనంగా నిర్మించిన సహకార సంఘ కార్యాలయం, హుస్నాబాద్‌లోని పీఏసీఎస్ దుకాణాల భవన సముదాయం

ఈసారైనా పూర్తయ్యేనా?

- నేడు సుడా మోడల్ లేఅవుట్ ప్లాట్ల బహిరంగ వేలం
- కనిష్ఠ ధర రూ.8 వేల నుంచి రూ.5500కు తగ్గింపు
- మిగిలిపోయిన 98 ప్లాట్లకు వేలం పాట



సిద్దిపేట అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) ఆధ్వర్యంలో సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలో 14 ఎకరాల్లో ఏర్పాటు చేసిన మోడల్ లేఅవుట్‌లో ప్లాట్ల వేలాన్ని సుడా అధికారులు మరోసారి నిర్వహిస్తున్నారు. సోమవారం, 20వ తేదీన వేలం పాట కొనసాగనున్నది. గత ప్రభుత్వ హయాంలో మిట్టపల్లి గ్రామానికి చెందిన 14 మందికి చెందిన అసైన్డ్ భూమిని సేకరించి రూ.6.50 కోట్లతో మోడల్ లేఅవుట్‌ను తీర్చిదిద్దారు. ఇందులో 161 ప్లాట్లను ఏర్పాటు చేయగా 55 ప్లాట్లను భూమి ఇచ్చిన వారికి ఇవ్వగా మిగిలిన 111 ప్లాట్లకు గతేడాది మే నెలలో బహిరంగా వేలం నిర్వహించారు. అప్పుడు కేవలం 13 మాత్రమే అమ్ముడుపోయాయి. ఇంకా 98 ప్లాట్లు అలాగే మిగిలిపోయాయి. వాటిని ఈ మధ్యకాలంలో కలెక్టర్ పరిశీలించి ధరలు తగ్గించి మరోసారి వేలం పాట నిర్వహించాలని అధికారులకు సూచించారు. దీంతో అధికారులు మరోసారి బహిరంగా వేలానికి సిద్ధమయ్యారు.

ఎకరాకు 800 గజాలు అందజేత

లేఅవుట్ కోసం ఎకరా భూమిని ఇచ్చిన వారికి 800 గజాల చొప్పున ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. రైతుల చేతిలో ఉన్నప్పుడు అవి అసైన్డ్ భూములుగా ఉండి అమ్ముకోవడానికి మార్చుకోవడానికి వీలులేకుండా ఉండేది. 800 గజాలను పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ చేసి పట్టా భూమిగా మార్చి ఇచ్చారు. దీంతో భూమిని అమ్ముకోవడానికి వారికి వీలుగా మారింది. భూమి ఇచ్చిన అందరికీ సుడా తరఫున ఒప్పందం ప్రకారం ప్లాట్లను కేటాయించినట్లు సుడా అధికారులు తెలిపారు. ఒకరు మాత్రమే వారి సొంత వ్యవహారాలతో రిజిస్ట్రేషన్ చేసుకోలేదు.

ధర తగ్గించి వేలానికి..

గతేడాది బహిరంగా వేలం నిర్వహించినప్పుడు గజానికి రూ.8000 చొప్పున ధరను నిర్ణయించారు. మార్కెట్ వాల్యూ అప్పుడు అక్కడ అంతా పలకకపోవడంతో ప్లాట్‌లకు డిమాండ్ లేకుండా పోయింది. ఈసారి ధరను తగ్గించి వేలం నిర్వహించనున్నారు. కలెక్టర్ సూచన మేరకు గజానికి రూ.5500 నిర్ణయించారు. ఈసారైనా పూర్తిస్థాయిలో ప్లాట్ల విక్రయిస్తారో చూడాలి.

కరుణామయుడికి కొత్త పంటలతో కృతజ్ఞతార్పణ

- పంటలు సమర్పించిన రైతులు
- తరలివచ్చిన భక్తులు
- కిటకిటలాడిన చర్చి పరిసరాలు

6



రైతులు సమర్పించిన కొత్త పంటలు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



నాచగిరిలో వెలిగిస్తున్న దీపాలు

- కార్తీక మాసం కావడంతో పెరిగిన తాకిడి
- పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు
- దీపాలు వెలిగించిన మహిళలు

8

పల్లెల్లో ఎనీటైమ్ మందు

- కిరాణ షాపుల్లో విచ్చలవిడిగా అమ్మకాలు
- అధికారుల అండదండలతో పెద్ద ఎత్తున బెల్టు షాపులు
- అధిక ధరలకు విక్రయం.. మందుబాబుల జేబులకు చిల్లు



సంగారెడ్డి క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించేందుకు మద్యం వ్యాపారులు కొత్త మార్గంలో వెళ్తున్నారు. ప్రభుత్వ విధానం ప్రకారం మద్యం దుకాణాలు పొందిన ప్రాంతాల్లో నిబంధనలకు మేరకు వ్యాపారం నిర్వహించాల్సి వుంటుంది. ఎంఆర్‌పీ ధరలు, సమయ పాలన పాటిస్తూ విక్రయాలు జరపాల్సి ఉంటుంది. ఈ విధంగా చేస్తే వ్యాపారంలో సరైన లాభాలు రావడం లేదనే ఉద్దేశంతో మద్యం వ్యాపారులు బెల్ట్ షాపులను ఎంచుకుని విక్రయాలు పెంచుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా గల్లీకో బెల్ట్ షాప్ కొనసాగుతోంది. మొత్తం 29 మండలాలు ఉండగా, 601 రెవెన్యూ గ్రామాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4500 వరకు బెల్ట్ షాపులు కొనసాగుతున్నట్టు అంచనా. గ్రామాల్లో చిన్న కిరాణ కొట్టు మాదిరిగా కొనసాగిస్తున్నా అందులో దొరకని మద్యం బ్రాండ్ అంటూ ఉండదు. మద్యం షాప్‌లు సమయ పాలన పాటించాల్సి ఉంటుంది. కానీ బెల్ట్ షాప్‌లకు మాత్రం ఎటువంటి సమయపాలన అవసరం లేదు. ఎనీ టైం మందు అనే విధంగా నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో కూడా మందు లభ్యమవుతోంది. ఈ విషయం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇటీవల చేసిన మెరుపు దాడుల్లో బహిర్గతమైంది. లక్షలాది రూపాయల అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు.

అధిక ధరలకు విక్రయాలు..

మద్యం దుకాణాల్లో అయితే ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు అమ్మకాలు కొనసాగించాల్సి వుంటుంది. కానీ బెల్ట్ షాప్‌లకు తరలించి అక్కడ అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం వ్యాపారులు క్వార్టర్‌పై రూ.20, హాఫ్ బాటిల్‌కు రూ.40, ఫుల్ బాటిల్‌పై రూ.80 అదనంగా బెల్ట్ షాప్‌లకు విక్రయిస్తున్నారు. ఇక బెల్ట్ షాప్‌ల నిర్వాహకులు క్వార్టర్‌పై రూ.30, హాఫ్‌పై రూ.60, ఫుల్ బాటిల్‌పై రూ.120లకు పెంచి మందుబాబులకు అమ్ముతున్నారు. ఒక్కో బీర్ బాటిల్‌పై రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లోని మద్యం ప్రియులు సమీప పట్టణానికి వెళ్లి వస్తే ప్రయాణ చార్జీలు అంతే అవుతాయని, పైగా సమయం వృథా అవుతుందనే ఉద్దేశంతో బెల్ట్ షాప్‌లలోనే కొనుగోలు చేస్తున్నారు.

ఎక్సైజ్ అధికారులకు భారీగా ముడుపులు

ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాపారం నిర్వహిస్తే తమకేం మిగులుతుందని ప్రశ్నిస్తూ మద్యం వ్యాపారులు బెల్ట్ షాపుల బాట పడుతున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినప్పటికీ వారు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎక్సైజ్ అధికారులే గ్రామాల్లో బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. మద్యం అమ్మకాలు పెంచాలంటూ మద్యం వ్యాపారులకు అధికారులు టార్గెట్ విధిస్తున్నారు. దీంతో వారు విచ్చలవిడిగా బెల్ట్‌షాపులను కొనసాగిస్తున్నారు. ఫలితంగా మద్యం వ్యాపారులు, బెల్ట్‌షాపుల నిర్వాహకుల నుంచి సంబంధిత అధికారులకు ప్రతి నెలా పెద్ద మొత్తంలో ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహిస్తూ అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేస్తున్నారు. కానీ ఎక్సైజ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ మద్యం ఎక్కడి నుంచి వచ్చిందీ? ఏ దుకాణం నుంచి వచ్చిందీ? అనే విషయాలపై ఆరా తీయడం లేదు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసినా రెండుమూడు రోజుల తర్వాత మద్యం అమ్మకాలు మళ్లీ యథావిధిగా కొనసాగిస్తున్నారు. దీనికి కారణం ఎక్సైజ్ అధికారుల అండదండలు మెండుగా ఉన్నాయనే ధీమాతోనే అనిఏ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్ట్‌షాపులపై కొరడా ఝుళిపిస్తారో లేక మరింతగా కరుణిస్తారో చూడాలి మరి.

కరుణామయునికి కృతజ్ఞతార్పణ

- కొత్త పంటలు సమర్పించిన రైతులు



భక్తులకు దైవ సందేశమిస్తున్న బిషప్

మెదక్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చి భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం మెదక్ చర్చిలో కోతకాలపు కృతజ్ఞతార్పణల పండగ ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చర్చిని మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు, అరటి కొమ్మలు, ప్రత్యేకమైన పూలతో అందంగా ముస్తాబు చేశారు. భక్తుల ప్రార్థనలతో మెదక్ చర్చిలో సందడి నెలకొన్నది. క్రైస్తవులు యేటా పంట తమ చేతికందే సమయంలో ప్రథమంగా వచ్చే పంటఫలాన్నీ దేవుడికి సమర్పిచడం ఆనవాయితీగా వస్తుంది. ఈసారి కూడా కోత కాలపు కృతజ్ఞతార్పణల పండగను అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. దక్షిణ ఇండియా సంఘం (సీఎస్ఐ), మెదక్ అధ్యక్ష మండలం (డయాసిస్) పరిధిలో వివిధ జిల్లాల నుంచి క్రైస్తవులు పంట ఉత్పత్తులను తీసుకొచ్చి కరుణామయుడుకి సమర్పించారు. ఈ సందర్భంగా బిషప్ రూబెన్మా మార్క్ మాట్లాడుతూ మనకు వచ్చిన పంటలలో ప్రతి ఏడు పది శాతం దేవుడికి సమర్పించడం మనకు అంతకంటే ఎక్కువే ప్రసాదిస్తాడని అన్నారు.



హాజరైన భక్తులు

ప్రాణం తీసిన చేపల పంచాయితీ

- రెండు గ్రామాల మధ్య కొనసాగుతున్న వివాదం
- చేపలు పట్టడానికి వెళ్లిన వర్దరాజ్‌పూర్ గ్రామస్థులు.. తరిమికొట్టిన ధర్మారంవాసులు
- పారిపోతూ చెరువులో పడి వ్యక్తి మృతి



సత్తయ్య(ఫైల్)

జగదేవ్‌పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు గ్రామాల మధ్య నెలకొన్న చేపల పంచాయితీ.. ఓ వ్యక్తి మృతికి కారణమైంది. ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ మండలం ధర్మారం, మర్కుక్ మండలం వర్దరాజ్‌పూర్ గ్రామాల మధ్య బోరబండ ప్రాజెక్టు ఉంది. ఇందులో చేపలు పట్టే విషయంలో రెండు గ్రామాల మధ్య కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతున్నది. ఈ పంచాయితీపై గతంలో పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదులు సైతం చేసుకున్నారు. కాగా, శనివారం వర్దరాజ్‌పూర్ గ్రామానికి చెందిన వారు బోరబండ ప్రాజెక్టులో చేపలు పట్టడానికి వెళ్లారు. గమనించిన ధర్మారం గ్రామస్థులు పెద్ద ఎత్తున ప్రాజెక్టు వద్దకు చేరుకోవడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం దాడికి దారి తీసింది. దీంతో వర్దరాజ్‌పూర్ గ్రామస్థులు ప్రాజెక్టు నుంచి పరుగులు పెట్టారు. ఈ క్రమంలో ఆ గ్రామానికి చెందిన ముచ్చపతి సత్తయ్య(55) అక్కడి నుంచి తప్పించుకునే సమయంలో ప్రమాదవశాత్తు ప్రాజెక్టులో పడ్డాడు. దీన్ని ఎవరు గమనించకపోవడంతో కుటుంబీకులు రాత్రి సత్తయ్య గురించి ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో వర్దరాజ్‌పూర్ గ్రామస్థులు ఆదివారం ఉదయం బోరబండ ప్రాజెక్టు వద్దకు వెళ్లి వెతకసాగారు. ఈ క్రమంలో చేపలు పడుతున్నారని మళ్లీ ధర్మారం గ్రామస్థులు అక్కడికి చేరుకోవడంతో బోరబండ ప్రాజెక్టు వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రెండు గ్రామాల ప్రజలను చెదరగొట్టారు. అనంతరం సత్తయ్య కనబడడంలేదని కుటుంబ సభ్యులు జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బోరబండ ప్రాజెక్టు వద్ద సత్తయ్య పాదరక్షకులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టగా.. నీటిలో సత్తయ్య మృతదేహం సాయంత్రం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారులు!

తూప్రాన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరిగిపోయిన గంజాయి అమ్మకం, సేవించే వ్యక్తులపై పోలీసులు దృష్టి పెట్టారు. తూప్రాన్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఇతర రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తిని, గంజాయి సేవించే పది మంది యువకులను ఆదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొట్టి బైక్ రైడర్ మృతి

తూప్రాన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆగి ఉన్న లారీని గమనించక ఢీకొట్టడంతో బైక్ రైడర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా మన్సూరాబాద్ రాక్‌హిల్స్‌కు చెందిన ధల్జిత్‌సింగ్ (37), సఫిల్‌గూడ్ మల్కాజిగిరికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాగర్ సంతోష్‌గౌడ్ వేర్వేరు వాహనాలపై బైక్ రైడ్‌కు ఆదివారం ఉదయం బయలుదేరారు. హైవే 44 మీదుగా వెళ్తుండగా తూప్రాన్ పట్టణ శివారులోని కరీంగూడ చౌరస్తా వద్ద పార్కింగ్ లైట్లు, ఇండికేటర్లు లేకుండా రోడ్డుపై నిలిపిన లారీని ధల్జిత్‌సింగ్ బైక్‌తో ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108 అంబులెన్స్‌లో మేడ్చల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి కుల్వంత్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొట్టి వ్యక్తి..



మృతి చెందిన సత్తయ్య

బెజ్జంకి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గాగిల్లాపూర్ రాజీవ్ రహదారి స్టేజి సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఆకేన సత్తయ్య (65) వంట మాస్టర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో తన బంధువుల ఇంటికి బైకుపై వెళ్లి ఆదివారం స్వగ్రామానికి వస్తున్నాడు. గాగిల్లాపూర్ స్టేజి సమీపంలోకి రాగానే హైదరాబాదు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు బైకును వెనుక నుంచి ఢీకొట్టడంతో సత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాహో సహకారం

ఆదర్శం.. హుస్నాబాద్ సహకార సంఘం



సహకార సంఘ ఫర్టిలైజర్ దుకాణం

- రూ.25 కోట్ల టర్నోవర్, రూ.77 కోట్ల ఆస్తులు
- రైతుల సంక్షేమం, లోన్లు, వ్యాపారాల్లో మేటి
- రూ.2.80కోట్లతో నూతన భవనం

హుస్నాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒకనాడు సిబ్బందికి జీతాలు ఇవ్వని పరిస్థితి.. కనీసం కూర్చుందామంటే కుర్చీలు కూడా లేని దుస్థితి.. పేరుకు సహకార సంఘమైనా సభ్యుల మనుగడ ప్రశ్నార్థకం.. చైర్మన్, డైరెక్టర్ పదవులూ అలంకార ప్రాయమై.. ఇటువంటి దయనీయమైన పరిస్థితుల్లో ఉన్న ఆ సంఘం నేడు కోట్ల టర్నోవర్‌తో ఆదర్శంగా నిలుస్తున్నది. 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన కొన్ని నిధులతో ఒక వైపు రైతుల సంక్షేమం.. మరో వైపు వ్యాపారం చేస్తూ నేడు రూ. 25 కోట్ల టర్నోవర్‌తో, రూ. 77 కోట్లకు పైగా ఆస్తులతో ముందుకు దూసుకపోతున్నది హుస్నాబాద్ సహకార సంఘం. దీని పరిధిలో 52 గ్రామాలతో పాటు 4,478 మంది సభ్యులున్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు భారత సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నెల 17న రూ.2.80 కోట్లతో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభిస్తున్నారు.

1959లో సంఘం ప్రారంభం..

హుస్నాబాద్ సహకార పరపతి సంఘం ఫిబ్రవరి 14, 1959లో మాజీ శాసన సభ్యుడు దివంగత బొప్పరాజు లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. అప్పటి నుంచి రైతులకు ఈ సంఘం ద్వారా అనేక రకాల సేవలందుతున్నాయి. కొన్ని సంవత్సరాల అనంతరం సహకార సంఘాలను పట్టించుకోని కారణంగా ఇచ్చిన అప్పుల వసూళ్ల వరకే పరిమితమయ్యాయి.



నూతనంగా నిర్మించిన సహకార సంఘ గోదాం

జీతాలు ఇవ్వలేని పరిస్థితి..

2005 సంవత్సరానికి ముందు సంఘం నష్టాల్లో ఉండడంతో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి. దీంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ ఆర్ రైతుల రుణమాఫీ చేయడమే కాకుండా దీనికి రూ. 1.68 కోట్లు ఇచ్చారు. ఈ నిధులతో రైతుల అవసరమైన ఎరువులు, విత్తనాలు ఇవ్వడం, ఓ వైపు వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూనే మరో వైపు పట్టణంలో వివిధ రకాల వ్యాపారాలు మొదలు పెట్టారు. అప్పుడే కందులు, వరి, మొక్క జొన్నల కొనుగోళ్లు సంఘానికి అప్పజెప్పడం.. కమీషన్లు వస్తుండటంతో ఆర్థికంగా బలోపేతం అయ్యింది.

ప్రారంభానికి సిద్ధంగా నూతన భవనం..

పాత సహకార సంఘ భవనం వెనుక నాబార్డు ద్వారా రూ. 2.80కోట్ల రుణం తీసుకొని జీప్లస్‌వన్‌తో నిర్మించిన సహకార సంఘ భవనం, గోదామును ఈ నెల 17వ తేదీన మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. 14 నుంచి 20 వరకు జరిగే భారత సహకార వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. అలాగే కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సంఘ వ్యవస్థాపకుడు దివంగత బొప్పరాజు లక్ష్మీకాంతారావు విగ్రహాన్ని కూడా ఆవిష్కరించనున్నారు.

రూ. 77 కోట్ల ఆస్తులు..

ఈ సంఘానికి దాదాపు రూ. 77 కోట్ల ఆస్తులున్నాయి. ఇందులో హుస్నాబాద్ పట్టణంలో రైసుమిల్లు గోదాం, షాపింగ్ కాంప్లెక్స్, స్ట్రాంగ్ రూమ్, పట్టణంలో పీపీబీసీ గోదాం, పందిల్లలో ఆర్‌సీసీ గోదాం, మల్లంపల్లిలో ఆర్‌సీసీ గోదాం, పోతారం (ఎస్)లో షెడ్ రూఫ్ గోదాంలు ఉన్నాయి. అలాగే అంతకపేటలో పెట్రోల్ బంకుతో పాటు నూతన సహకార సంఘ భవనం, గోదాం తదితర ఆస్తులున్నాయి.

ఓ వైపు రైతుల సంక్షేమం.. మరో వైపు వ్యాపారం..

రైతులకు ఎరువులు, విత్తనాలు అందించడంతోపాటు వారి నుంచి ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. చిరువ్యాపారులకు రుణాలు, గోల్డ్, హౌజింగ్, వెహికిల్స్ లోన్ల వంటి వ్యాపారాలతో పాటు అక్కన్నపేట మండలం అంతకపేటలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఈ మూడు నెలల కాలంలోనే రూ.40 లక్షల ఆదాయం వచ్చింది. ఏటా రూ.76.31 లక్షల ఎరువులు, విత్తనాలు రైతులకు విక్రయిస్తున్నారు. సహకార సంఘం ద్వారా 27 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో సంవత్సరానికి రూ. కోటి కమీషన్ వస్తుంది. పట్టణంలోని హన్మకొండ రోడ్డులో 23 షట్టర్ల భవన సముదాయాన్ని నిర్మించగా దీని ద్వారా ఏడాదికి రూ.22.44 లక్షల కిరాయి వస్తుంది. సంఘం ద్వారా రైతులతో పాటు మొత్తం రూ.18.19 కోట్ల వివిధ రకాల రుణాలు ఇచ్చారు. కాగా ఈ సంవత్సరం అన్ని ఖర్చులు పోనూ రూ. 1.48 కోట్ల లాభం సంఘానికి వచ్చింది. సంఘంలో లాకర్ సౌకర్యం ఉంది. రూ.78 లక్షల డిపాజిట్లు కూడా ఉన్నాయి. ప్రస్తుతం రూ. 25 కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతుంది.



అందరి సహకారంతోనే..



రైతులు, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధుల సహకారం వల్లే ఇంత అభివృద్ధి సాధించాం. రైతుల సంక్షేమాన్ని చూసుకుంటూనే సంఘం ద్వారా వ్యాపారం చేయడంతో ప్రస్తుతం రూ. 25 కోట్ల టర్నోవర్ ఉంది. రూ.77 కోట్లకు పైగా ఆస్తులు కూడా ఉన్నాయి. అన్ని రకాల రుణాలు ఇస్తున్నాం. మున్ముందు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతాం. రైతుల కోసం విత్తనశుద్ధి కార్మాగారం, ఒక రైస్‌మిల్లు ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉంది.

-బొలిశెట్టి శివయ్య, చైర్మన్

డీసీఎం, ఆటో ఢీకొని.. ముగ్గురికి తీవ్ర గాయాలు

- అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలింపజేసిన మంత్రి పొన్నం



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గజ్వేల్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డీసీఎం ఆటో ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన గజ్వేల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట పట్టణానికి చెందిన పెద్దమ్మ, కనకవ్వ, స్వప్న ముగ్గురు హైదరాబాద్ నుంచి పూలు తీసుకుని వస్తుండగా మార్గమధ్యలో గజ్వేల్ మండలం కొడకండ్ల రాజీవ్ రహదారిలో 400 కేవీ సబ్‌స్టేషన్ వద్ద ముందుగా వెళ్తున్న డీసీఎంను ఆటో ఢీకొట్టగా ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రమాదాన్ని గ్రహించి దగ్గరుండి క్షతగాత్రులు అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపజేశారు. వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

గురుకులాల జోనల్ స్థాయి క్రీడలకు సర్వం సిద్ధం

మెదక్ అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల(బాలికల) మైదానంలో సోమవారం నుంచి 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సువర్ణలత తెలిపారు. ఆదివారం మైదానంలో ఆమె ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. నాలుగు రోజుల పాటు జరిగే పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గురుకుల పాఠశాల, కళాశాల కార్యదర్శి అలుగు వర్షిణి ఆదేశాల మేరకు సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలోని 13 గురుకులాలు, కళాశాలల నుంచి 1100 మంది క్రీడాకారులు పోటీలకు హాజరవుతున్నారని తెలిపారు. అండర్- 14, 17, 19 మూడు విభాగాల్లో పరుగు పందెం, డిస్కస్‌త్రో, లాంగ్, హై జంప్ కబడ్డీ, ఖోఖోతోపాటు అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. 13 మంది పీడీలు, 13 మంది పీఈటీలతోపాటు క్రీడల నిర్వహణకు 15 కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మదూరు విద్యార్థులు





అంకిత, రమేష్

చిన్నశంకరంపేట, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడాపోటీలకు చిన్నశంకరంపేట మండలంలోని మదూరు హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు అల్లి నరేష్ ఆదివారం తెలిపారు. తొమ్మిదవ తరగతి విద్యార్థులు సీహెచ్ అంకిత, రమేష్ చేగుంట మండల కేంద్రంలో శనివారం జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా పోటీల్లో ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఆ విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

బందారం విద్యార్థిని..



లక్ష్మి ప్రసన్న

కొండపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో కొండపాక మండలం బందారం ఉన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మి ప్రసన్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలను ప్రోత్సహించేందుకే స్పోర్ట్స్ యూనివర్సిటీ

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

హుస్నాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడలను ప్రోత్సహించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని మినీ స్టేడియంలో మూడురోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్ -14 బాల, బాలికల హ్యాండ్ బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగం ఫైనల్‌లో వరంగల్, కరీంనగర్ జట్లు తలపడగా వరంగల్ విజయం సాధించింది. బాలికల విభాగంలో ఆదిలాబాద్, వరంగల్ జట్లు పోటీపడగా ఆదిలాబాద్ విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి కెబినెట్ అమోదం తెలిపిందని, ఇందులో క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న వారికే ప్రవేశం ఉంటుందన్నారు. హుస్నాబాద్ నుంచి అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందాలన్నారు. హుస్నాబాద్ స్టేడియం క్రీడలకు వేదిక కావాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంఈవో మనీల, కమిషనర్ మల్లిఖార్జున్, నిర్వాహకులు రాగుల శ్రీనివాస్, జంగపల్లి వెంకటనర్సయ్య, బూట్ల రాజమల్లయ్య, చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి, పద్మ, సరోజన పాల్గొన్నారు.

ఆడుతూ.. పాడుతూ..

- ఉత్సాహంగా పిల్లల పండుగ ● పాల్గొన్న ఐజీపీ సుమతి

జహీరాబాద్, నవంబరు 10 : జహీరాబాద్ పట్టణంలోని ఆర్ఎల్లార్ పాఠశాలలో శ్రామిక విజ్ఞాన కేంద్రం, చిల్డ్రన్ ఫెస్ట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పిల్లల పండుగ ఘనంగా జరిగింది. నియోజకవర్గంలోని 75 పాఠశాలలకు చెందిన 2500 మంది విద్యార్థులు హాజరై పాటలు, కోలాటం, ఏకపాత్ర అభినయం, మ్యూజిక్, డ్రాయింగ్, కథలు, మట్టి బొమ్మల తయారీ తదితర పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన హైదరాబాద్ ఐజీ సుమతి ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలోని సృజనాత్మకత బయటపడుతుందని పేర్కొన్నారు. శ్రామికవిజ్ఞాన కేంద్రం, చిల్డ్రన్స్ ఫెస్ట్‌కమిటీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.



మట్టిబొమ్మల తయారీ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



పిల్లల పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఐజీ సుమతి

కేతకీలో పూజలు..

ఝరాసంగం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ప్రసిద్దిగాంచిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర ఐజీ సుమతి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమెను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్‌రెడ్డి

కల్హేర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంగారెడ్డి జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్‌రెడ్డి అన్నారు. కల్హేర్, సిర్గాపూర్‌లలో ఉన్న ఎస్సీ బాలర సంక్షేమ వసతి గృహాలను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. వసతుల గురించి వార్డెన్ కిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, వంట వస్తువులు, తాగునీటి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అందాల్సిన వస్తువులు, బియ్యం, కూరగాయలు పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్షేమ గృహాల్లో చదివే విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఆయన వెంట డివిజనల్ సహాయ సంక్షేమ అధికారి చందా శ్రీనివాస్ ఉన్నారు.



కల్హేర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో అఖిలేష్‌రెడ్డి

కార్మికుల హక్కుల సాధనకు నిరంతర పోరాటాలే శరణ్యం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

పటాన్‌చెరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు తొత్తులుగా మారి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల సాధనకు నిరంతర పోరాటలే శరణ్యమన్నారు. ఆదివారం స్థానిక ఐలా భవన్‌లో ఏర్పాటు చేసిన కిర్బీ కార్మికుల యూనియన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులు ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రజలు చెల్లించే పన్నులతో ప్రభుత్వాలు నడుపుతున్న పాలకులు తిరిగి ఏం చేస్తున్నారో వివరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు రాజయ్య, పాండురంగారెడ్డి, వీఎస్.రాజు, నాగప్రసాద్, ఏడుకొండలు, లఖాన్, లక్ష్మన్, వెంకట్, జైపాల్, మహేశ్వర్ రెడ్డి, మల్లేశం, తలారిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు

క్రైం కార్నర్

నీట మునిగి బాలుడి మృతి

జహీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :ఈతకు వెళ్లి నీట మునిగి బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మల్‌చెల్మ గ్రామానికి చెందిన ఇలియాస్(17) కుటుంబంతో జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో నివాసముంటున్నాడు. ఆదివారం మల్‌చెల్మ గ్రామ శివారులోని ఈరన్నవాగు చెరువులోకి స్నేహితుడితో కలిసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి మామ షాకిర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు




బోల్తా పడిన కారు

కొండపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం మర్పడగ శివారులో కారు అదుపుతప్పి ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు మిత్రుడైన కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామానికి చెందిన సాయిగణేష్ ఇంటికి శనివారం రాత్రికి వచ్చారు. వారితోపాటు సాయిగణేష్ తెల్లవారుజామున కారులో సిద్దిపేటకు వెళ్లి తిరిగి సిరిసినగండ్ల గ్రామానికి వస్తున్నారు. మర్పడగ శివారులో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయే ప్రయత్నంలో కారు అదుపుతప్పి చెరువు కట్ట కిందికి దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సాయిగణేష్, రోహన్, రాహుల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోరా?

● సెలవు రోజుల్లో తెరుచుకోని మద్దూరు పీహెచ్‌సీ



మద్దూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆస్పత్రులకు సెలవు రోజుల్లో వేసిన తాళాలు తెరుచుకోవడం లేదు. ఆదివారం ఉదయం 11 గంటలైనా పీహెచ్‌సీ తెరుచుకోలేదు. జిల్లా వైద్యశాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలా జరుగుతున్నదని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఆదివారంతో పాటు ఇతర సెలవు రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సమయపాలన పాటించాలనే ప్రభుత్వ ఆదేశాలున్నప్పటికీ మద్దూరు పీహెచ్‌సీకి మాత్రం అవేమీ పట్టకపోవడం శోచనీయమని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న ఈ పీహెచ్‌సీకి వైద్యసేవల కోసం వచ్చినా ఎవరు లేకుండా పోవడంతో వెనుదిరిగి వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని మండల ప్రజలు వాపోతున్నారు. ఆస్పత్రిలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలూ లేకపోలేదు. ఆస్పత్రిలో సిబ్బంది సమయపాలన పాటించేలా చూసి మండల ప్రజలకు వైద్యసేవలు అందే విధంగా డీఎంహెచ్‌వో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల గోస పట్టదా?

● సమయానుకూలంగా బస్సులు లేక ఇబ్బందులు పడుతూ పాఠశాలలకు

● ఆటోల్లో, ద్విచక్రవాహనాలపై పరిమితికి మించి ప్రమాదకరంగా ప్రయాణం


ఆటోలో నిలబడి వెళ్తున్న విద్యార్థులు

గజ్వేల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదపుటంచున విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు. గజ్వేల్ నుంచి సంగాపూర్ వరకు రోడ్డు వెంట దాదాపు రెండున్నర కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తూ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడ్యుకేషన్‌హబ్ ప్రారంభించి దాదాపు ఐదు సంవత్సరాలు కావస్తున్నా విద్యార్థులకు సమయానుకూలంగా బస్సు సౌకర్యం కల్పించే నాథుడే కరువయ్యాడు. అడపాదడపా విద్యార్థి సంఘాల నాయకులు ఆర్టీసీ అధికారులు, ఇతర శాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ స్పందన లేకపోవడంతో విద్యార్థులకు గోస తప్పడం లేదు.

ప్రమాదకరంగా ప్రయాణం

కళాశాల, పాఠశాల సమయానికి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఏ వాహనం వచ్చినా ఎక్కి ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. ఆటోల్లో నిలబడి, ద్విచక్రవాహనాలపై ముగ్గురు, నలుగురు కలసి ప్రయాణం చేస్తున్నారు. అటు బ్యాగులు మోస్తూ... ఇటు నడుస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక రోడ్లపై విద్యార్థులు కిలోమీటర్ల మేర నడుస్తూ వెళ్తున్న క్రమంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. అంతే కాకుండా ఆడపిల్లలకు పోకిరీల నుంచి ఇబ్బందులు లేకపోలేదు.

సమయానుకూలంగా బస్సు నడపాలి

విద్యార్థులకు కళాశాల, పాఠశాల సమయానికి అనుగుణంగా బస్సు సౌకర్యం కల్పించాలి. బస్సులు లేకపోవడంతో విద్యార్థులు కిలోమీటర్ల మేర నడుస్తూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక విద్యార్థినులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు ఇందుకు చొరవ చూపాలి.

- తాటికొండ రవి,
యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు

పలువురిని పరామర్శించిన కేంద్ర మంత్రి 'బండి'


లక్ష్మణరావును పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

అక్కన్నపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటపల్లి గ్రామంలో హుస్నాబాద్ అసెంబ్లీ కో కన్వీనర్ జనగామ వేణుగోపాలరావు తండ్రి లక్ష్మణరావు ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందిన విషయం తెలుసుకున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్కన్నపేట మండల కేంద్రంలో మూడు నెలల క్రితం ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీ కొట్టిన సంఘటనలో పంతులు తండాకు చెందిన కరెంటోతు స్వరూప, కరెంటోతు కవిత మృతి చెందగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, నాయకులు తదితరులున్నారు.

చౌటపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్‌పై వినతి

మండలంలోని చౌటపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ నిర్మించేందుకు తమ భూములను అక్రమంగా తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని రైతులు ఆదివారం చౌటపల్లికి వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి వివరాలు తెలుసుకుని అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

'పిల్లలకు తార్కికంగా ఆలోచించే గుణముంది'


ఆదర్శ మాతృమూర్తులకు సన్మానిస్తున్న వక్తలు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) పిల్లలకు తార్కికంగా ఆలోచించే గుణముందని, వారు అడిగే ప్రశ్నలకు ఓపికతో సమాధానం చెబితే వాళ్లు మేధావులవుతారని విద్యాభారతీ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్ రెడ్డి అన్నారు. సిద్దిపేటలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో మాతృమండలి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మాతృసమ్మేళనం 2024 కార్యక్రమంలో ముఖ్యవక్తగా మాట్లాడారు. పిల్లలు ఫోన్లకు బానిసలు కావడానికి తల్లిదండ్రులే కారణమని, తల్లిదండ్రుల చేతుల్లో నిత్యం సెల్‌ఫోన్ ఉంటుంది కాబట్టి పిల్లలు కూడా ఫోన్ కావాలని అడుగుతున్నారని, అదే పేరెంట్స్ పుస్తకం పట్టుకుంటే పిల్లలు కూడా బుక్స్‌కు అలవాటు పడుతారన్నారు. ఈ సందర్భంగా పిల్లలను పెంచటంలో శ్రద్ధ చూపిస్తున్న మాతృమూర్తులు మాధవి, వైష్ణవికి సన్మానం చేశారు. కార్యక్రమంలో పెద్ది వైకుంఠం, కొమురవెల్లి శేఖరం, కాటం రవీందర్, ప్రసన్న, కల్పన, వినోద్ మోదాని, ఆచార్య బృందం, మహిళలు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

సిద్దిపేట అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుమారు 30 సంవత్సరాలు ఒకే డిపోలో విధులు నిర్వహించి ఐదు సార్లు ఉత్తమ ఉద్యోగిగా అవార్డులు అందుకున్న రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఎల్లయ్యను సిద్దిపేట ఏకలవ్య ఎరుకల ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డీపీవో పోచయ్య మాట్లాడుతూ.. టీజీఎస్ ఆర్టీసీలో సుదీర్ఘంగా ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా క్రమశిక్షణతో ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించిన వ్యక్తి కెమ్మసారం ఎల్లయ్య అని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీయూఎస్ ప్రధాన కార్యదర్శి కెమ్మసారం రవీందర్, విద్యుత్ శాఖ ఏఈలు కెమ్మసారం కనకయ్య, మల్లేశం, ప్రభుత్వ ఉపాధ్యాయులు దేవర మల్లయ్య, ఏకలవ్య ఎరుకల ఉద్యోగ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు కెమ్మసారం నర్సింహులు, కెమ్మసారం యాదగిరి, కెమ్మసారం రవి, సిద్దిపేట ఏకలవ్య ఎరుకల సంఘం అధ్యక్షుడు కెమ్మసారం రాజేష్ ఖన్నా ఉన్నారు.

రూ.4 లక్షల విలువైన ఎల్‌వోసీల అందజేత

చేర్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం కడవెర్గు, చిట్యాల గ్రామాల్లో రూ. 4 లక్షల ఎల్‌వోసీలను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ ఆదివారం అందజేశారు. కడవెర్గుకు చెందిన జంగ ఆశయ్య రోడ్డు ప్రమాదంలో కాలుకు గాయమై సర్జరీ కోసం ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్నాడు. అలాగే చిట్యాలకు చెందిన నాగారం పోషయ్య కాలుకు తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ కావడంతో చికిత్సకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుపగా బీసీ సంక్షేమ, రవాణా శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి ఇరువురికి రూ.రెండు లక్షల చొప్పున ఎల్‌వోసీలు అందించారు.

మైనంపల్లి బెదిరింపులకు భయపడేది లేదు

● బీఆర్ఎస్వీ యువజన విభాగ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిద్దిపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మైనంపల్లి హనుమంతరావు, ఆయన అనుచరులు చేస్తున్న బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని బీఆర్ఎస్వీ యువజన విభాగం సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు నిమ్మ రజనీకాంత్‌రెడ్డి, సామల్ల సాయిప్రేమ్, పెర్క బాబులు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ.. మైనంపల్లి హనుమంతరావుపై కౌన్సిలర్ బ్రహ్మం చేసిన వ్యాఖ్యలపై తన అనుచరులతో బెదిరింపు కాల్స్ చేస్తున్నారని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తమకు ఒక్క సైగ చేస్తే సిద్దిపేట పొలిమేరలో కుడా మైనంపల్లి హనుమంతరావు అడుగు పెట్టలేరని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు కోసం సిద్దిపేటలో పర్యటనలు చేస్తూ ఇక్కడ ప్రశాంతతను దెబ్బ తీస్తూ తమ కార్యకర్తలని రెచ్చగొట్టడం సరికాదన్నారు. సిద్దిపేట ఉద్యమాల, పోరాటాల గడ్డ అని, సమైక్య నినాదంతో ఆనాడు నువ్వు సిద్దిపేటకు వస్తే గతంలో నిన్ను ఈ గడ్డ నుంచి తరిమిన రోజులు మర్చిపోయావా అని పేర్కొన్నారు. అభివృద్ధిలో ఆదర్శంగా ఉన్న సిద్దిపేటలో అలజడుల, ఆగడాల చేస్తే ఊరుకునేది లేదన్నారు. జరిగే సంఘటనలకు, దాడులకు రానున్న రోజుల్లో కచ్చితంగా ప్రతిదాడులు కొనసాగుతాయని, తమపై గుండా గిరి చేస్తానంటే మాత్రం కచ్చితంగా ప్రతిఘటిస్తాం ఖబడ్దార్ అని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లాల్ కమాన్ సంతు, తాతోజి బ్రహ్మం, దయాకర్, సాయిచరణ్‌గౌడ్, అరవింద్‌రెడ్డి, బత్తుల ఆకాష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాచారాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలి

● అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్


కోహెడ: బస్వాపూర్‌లో సమగ్ర కుటుంబ సర్వే తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

హుస్నాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్యూమరేటర్లు ప్రజలతో ఓపికగా వ్యవహరించి సమగ్ర సమాచారాన్ని సేకరించి జాగ్రత్తగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు.

● కోహెడ: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్ సురేఖ, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

● కొండపాక: మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను తహసీల్దార్ దిలీప్ నాయక్ పరిశీలించారు. ఇంటి వద్ద ఉండి వివరాలను అందించి సహకరించాలని పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్ రావు తెలిపారు.

● ములుగు: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని చిన్నతిమ్మాపూర్, ములుగు, కొట్యాల గ్రామాల్లో సర్వే తీరును పరిశీలించారు.

● దుబ్బాక/మిరుదొడ్డి: దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతున్నది మిరుదొడ్డి మండలం ధర్మారం, కూడవెళ్లి, అక్బర్‌పేట గ్రామాల్లో సర్వే తీరును ఎంపీడీవో గణేష్‌రెడ్డి పరిశీలించారు.

● కుకునూరుపల్లి: లకుడారం, మెదినీపూర్ గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే తీరును తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంఈవో బచ్చలి సత్తయ్య పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవి, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను విమర్శిస్తే ఖబడ్దార్

● సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్


మాట్లాడుతున్న సాకిబాల్‌లక్ష్మి ఆమె భర్త ఆనంద్

సిద్దిపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను విమర్శిస్తే ఖబడ్దార్ అంటూ బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ హెచ్చరించారు. సిద్దిపేట పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులపైన, కార్యకర్తలపైన అబద్ధాలు మాట్లాడి, ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. సిద్దిపేట నియోజవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పర్సంటేజీ డబ్బులు తీసుకుంటున్నారని అబద్ధపు, అవాస్తవపు మాటలు మాట్లాడటం బీఆర్ఎస్ నాయకులకు తగదని సూచించారు. పర్సెంటేజీలు తీసుకున్నారని నిరూపించాలని, దానిపై బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో నాయకులు తప్పెట శంకర్, మధు, గయాజుద్దీన్, పరుశురాములు, నజ్జు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధే లక్ష్యం

వార్డు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని 37వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ సాకిబాల్‌లక్ష్మి ఆమె భర్త ఆనంద్‌లు స్పష్టంచేశారు. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ పోచమ్మ కమ్యూనిటీ హాల్‌లో వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా మైనంపల్లి హనుమంతురావు చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశామనాన్నరు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజాస్పందన చూసి బీఆర్ఎస్ నేతల్లో ఆందోళన మొదలైందని తెలిపారు. దీంతో వారికి ఏమీ తోచక మైనంపల్లికి సిద్దిపేటలో ఏమీ పని అంటూ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాకి శ్రీనివాస్, గ్యాదరి భూమలింగం, గ్యాదరి మధు, గుజ్జరి రామదాస్, పిడిశెట్టి రాములు, పారక రవి, సాకి రఘు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు వస్తున్నాయంటూ బంక్ ఎదుట వినియోగదారుడి ఆందోళన


తన బైక్ నుంచి తీసిన కల్తీ పెట్రోల్‌ను చూపుతున్న బాధితుడు

చేర్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్లో నీళ్లు వస్తున్నాయని ఆరోపిస్తూ ఓ వినియోగదారుడు ఆదివారం చేర్యాల పట్టణ శివారులోని ఓ పెట్రోల్ బంక్ వద్ద ఆందోళన చేపట్టాడు. మండలంలోని ముస్త్యాలకు చెందిన బైకని కమలాకర్ ఇటీవల రూ.500తో తన బైక్‌లో పెట్రోల్ పోయించుకున్నాడు. ఆదివారం ఉదయం బైక్ ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో మెకానిక్ వద్దకు తీసుకెళ్లాడు. మెకానిక్ బైక్ ట్యాంక్ నుంచి పెట్రోల్ తీసి చూడగా పెట్రోల్లో నీరు కలిసి రావడంతో ఖంగుతిన్నారు. దీంతో కమలాకర్ కల్తీ పెట్రోల్‌ను బాటిల్లో తీసుకుని బంక్ వద్దకు వెళ్లి నిర్వహకులను నిలదీశారు. వారు నిర్లక్ష్యంగా మాట్లాడటంతో కమలాకర్ ఆగ్రహం వ్యక్తంచేశాడు. ఈవిషయమై సోమవారం అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు కమలాకర్ పేర్కొన్నారు.

కొమ్మూరిని కలిసిన న్యాయవాదులు

చేర్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మున్సిఫ్ కోర్టుకు ఇటీవల 27మంది సిబ్బందిని మంజూరుచేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల పలువురు న్యాయవాదులు ఆదివారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సిబ్బంది మంజూరుకోసం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేసిన కృషిని కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

చిన్నకోడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. మండలంలోని గంగాపూర్‌లో శనివారం రాత్రి కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కళాబృందం, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు ప్రజలకు మూఢనమ్మకాల, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాల గురించి నాటకం, పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక రెడ్డి సంఘం అధ్యక్షుడిగా సుభాష్‌రెడ్డి

దుబ్బాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక రెడ్డి యువజన సంఘం అధ్యక్షుడిగా కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డిని ఆ సంఘం సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే నూతన కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు.

రెవెన్యూ డివిజన్ జేఏసీ కొమురవెల్లి కన్వీనర్‌గా..


రమణారెడ్డి

చేర్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ కొమురవెల్లి మండల కన్వీనర్‌గా ఐనాపూర్ మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన కొమురవెల్లిలో విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటానన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

సిద్దిపేట అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సీపీఎం సిద్దిపేట అర్బన్ మండల 3వ మహాసభను ఆదివారం సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసి ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్తి స్థాయిలో గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



సిద్దిపేట అర్బన్: మాట్లాడుతున్న ఆముదాల మల్లారెడ్డి

● చేర్యాల: చేర్యాల పట్టణ సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎంను ప్రజలు ఆదరించాలని, మహాసభల విజయవంతానికి కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. చేర్యాల పట్టణ 20వ మహాసభ స్థానికంగా ఉన్న ఓ గార్డెన్‌లో ముత్యాల ప్రభాకర్, ఇప్పకాయల శోభ, పోలోజు శ్రీహరి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల సీపీఎం కార్యదర్శిగా రాళ్లబండి నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులుగా పోలోజు శ్రీహరి, ముత్యాల ప్రభాకర్, ఆముదాల నర్సిరెడ్డి, బోయిన మల్లేశం, ఇప్పకాయల శోభ, రాళ్లబండి భాస్కర్, ఆముదాల రంజిత్‌రెడ్డి, ఎర్రబోసు అశోక్, ఎన్నికైనట్లు తెలిపారు.

గుట్టకాయ స్వాహా

ఐదో పేజీ తరువాయి


అక్కన్నపేట మండలం గండిపల్లిలో గుట్టను ఎక్స్‌కవేటర్‌తో తవ్వి చదును దృశ్యం

ఈ భూములను కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. కొందరు రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని మామూళ్ళు ఇచ్చి అక్రమ పట్టాలు పొంది విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ భూములు అక్రమార్జనకు గురై లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా ఎక్స్‌కవేటర్‌లు తీసుకువచ్చి గుట్టలను చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అసైన్డ్ భూములు అమ్మడానికి వీలు లేకున్నప్పటికీ కబ్జాదారులు మంత్రాంగం నడిపించి దక్కించుకుంటున్నారు. ఎవరైన ఫిర్యాదు చేస్తే అధికారులు హడావుడిగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడం తప్ప చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, శనివారం గండిపల్లిలో ఓ రైతు ఎక్స్‌కవేటర్‌తో గుట్టలను చదును చేస్తున్న విషయంపై తహసీల్దార్‌కు సమాచారం అందించగా, ఆర్ఐని అక్కడికి పంపించారు. చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్‌తో పాటు రెండు డోజర్లను సీజ్ చేయాల్సి ఉన్న తూతూమంత్రంగా పనులను నిలిపివేయించారు తప్పితే ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ భూములను ఎవరైనా అక్రమంగా కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కొంతమంది ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని పెద్దపెద్ద యంత్రాలు పెట్టి చదును చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. రెవెన్యూ సిబ్బంది చదును చేస్తున్న భూమి వద్దకు వెళ్లే సరికి యంత్రాలను వదిలేసి వెళ్లిపోయారు. ప్రభుత్వ భూములు కబ్జాలు జరుగుతున్నట్లు ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందిస్తాం. ఎవరైనా సరే ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

- అనంతరెడ్డి, తహసీల్దార్, అక్కన్నపేట

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

● కార్తీక మాసం కావడంతో పెరిగిన తాకిడి

● పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

● దీపాలు వెలిగించిన మహిళలు

చేర్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమారించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనం చేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండప పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్తీక మాసం సందర్భంగా దేవాదాయ శాఖ ఆదేశానుసారం సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించారు.

కొమురవెల్లి మల్లికార్జునస్వామికి బుయ్యకర్ శంకర బాయి శివకుమార్ దంపతులు సుమారు రెండున్నర లక్షల విలువ చేసే రెండు కిలోల వెండి బిందె, 400 గ్రాముల హారతిపేట్లు విరాళంగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ వారికి స్వామి వారి శేషవస్త్రములతో పాటు ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు బసవేశ్వర్, టెంపుల్ గుమస్తా సిద్ధయ్య ఉన్నారు.

కొమురవెల్లి మల్లికార్జునస్వామిని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, కాంగ్రెస్ మద్దూరు మండల మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కూకట్ల బాల్‌రాజ్, పార్టీ నాయకులు పొన్నం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


వర్గల్: నాచగిరి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా దీపాలు వెలిగిస్తున్న మహిళలు


చేర్యాల: కొమురవెల్లి మల్లన్న ఆలయంలో కుటుంబసమేతంగా రాజిరెడ్డి


వర్గల్: వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

● వర్గల్: మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా రెండో ఆదివారాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ పండితులు మురళీధరచార్యుల నేతృత్వంలో ఆలయ మండపంలో వ్రతాలు వైభవంగా జరిగాయి. సత్యనారాయణ స్వామి వ్రతంలో సుమారు 100 జంటలు పాల్గొన్నాయి. ఆలయ నిర్వాహకులు టేకుల పల్లి రాంరెడ్డి పర్యవేక్షణలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.

మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ మండపంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు.

● జగదేవ్‌పూర్: మండలంలోని కొండపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం కొండపోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది కనకయ్య, లక్ష్మణ్, సుధాకర్, హరి, చిన్న తదితరులు పాల్గొన్నారు.